సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



నకిలీ విత్తనాలుగా తేలితే..

సన్నరకం వరి విత్తనాలు నకిలీవని తేలితే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు.

- 8లో ▸



యోగాలో పతకాల పంట

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగాసన పోటీల్లో పాల్గొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.9 /21.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'నవోదయ' దరఖాస్తుల గడువు పొడిగింపు

నిజాంసాగర్: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును పొడిగించారు. ముందుగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు గడువు ఈనెల 16తో ముగిసింది. అయితే దరఖాస్తు గడువును ఈనెల 23 వరకు పొడగించారని విద్యాలయం ప్రిన్సిపాల్ సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మక్క, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తొందరపడి వ్యాపారులకు మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దని సూచించారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామనే దానిపై త్వరలోనే స్పష్టత ఇస్తామని, రైతులు గమనించాలని కోరారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

ఖలీల్‌వాడి: వినాయక నిమజ్జనం నేపథ్యంలో జిల్లాలో మంగళవారం వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్‌లను మూసివేయాలని సీపీ కల్మేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే ఎక్సైజ్ చట్టం ప్రకారం చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

యువ రైతులకు నైపుణ్య శిక్షణ

డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామీణ యువ రైతులకు వరి విత్తనోత్పత్తిపై నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) పీడీ ప్రవీణ్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీలో గల జీవ నియంత్రణ ప్ర యోగశాలలో ఈ నెల 23 నుంచి 29 వర కు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం నైపు ణ్య శిక్షణ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. జిల్లాలో 10వ తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ యువ రైతులు కలెక్టరేట్‌లోని 101 నంబరు గల ఆత్మ కార్యాలయంలో 20లోగా పేర్లు న మోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94406 87698ను సంప్రదించాలన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి 10,465 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 550 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది.



నిజామాబాద్ ఖిల్లా జైలులో కొన్ని నెలల పాటు దాశరథి కృష్ణమాచార్యులు, వట్టికోట ఆళ్వారులు సైతం బందీలుగా ఉన్నారు. దాశరథి జైలు గోడలపై బొగ్గుతో నిజాం పాలనకు వ్యతిరేకంగా 'నా తెలంగాణ కోటి అందాల జాణ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గోడలపై రాశారు. ఈ నినాదం నిజాం విముక్తి పోరాటంతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో తొలి, మలి విడత ఉద్యమాలను ముందుకు నడిపింది.



నిజాం వ్యతిరేక పోరులో ఇందూరు వీరులు



గాంధీచౌక్‌లోని అమరవీరుల స్తూపం

- నిజాం అరాచక పాలన, రజాకార్ల అకృత్యాలను ఎదురించడంలో ప్రాణాలు పణంగా పెట్టిన పోరాట యోధులు
- తిరుగులేని పాత్ర పోషించిన ఆర్యసమాజ్
- 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ దాశరథి కృష్ణమాచార్యులు నినదించింది ఇక్కడి నుంచే..
- 'రాజకీయ ఖైదీల బొందలగడ్డ'గా పేరుపొందిన నిజామాబాద్ ఖిల్లా జైలు

తెలంగాణ ప్రాంతాన్ని నిరంకుశ నిజాం పాలన నుంచి విముక్తం చేసేందుకు చేసిన పోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేకంగా పేర్కొనదగింది. ఈ సాయుధ పోరాటంలో అనేకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేశారు. ఫలితంగా సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ గడ్డపై త్రివర్ణ పతాకం మొదటిసారిగా సగర్వంగా రెపరెపలాడింది. భారతదేశం 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వాళ్ల నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటికీ నాటి తెలంగాణ మాత్రం మరో 13 నెలల పాటు వీరోచిత పోరాటం చేయాల్సి వచ్చింది. అనేక మంది ప్రాణాలను కోల్పోయారు. పోరాటాన్ని ముందుకు నడిపించడంలో ఆర్యసమాజ్ పోషించిన పాత్ర ఎనలేనిది. మరోవైపు తెలంగాణ కవులు తమ సాహిత్యాన్ని పోరాట పంథాలోనే రాశారు. ఈ సాహిత్యం ఉద్యమకారుల్లో స్ఫూర్తిని రగిలించింది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజాంపై పోరులో ఉమ్మడి ఇందూరు జిల్లా నుంచి 700 మందికి పైగా ప్రత్యక్ష పోరాటం చేశారు. ఇందులో రాధాకృష్ణ మోదాని, సర్దార్ ప్రేమ్‌సింగ్, సర్దార్ వామాన్ సింగ్, నల్ల నరసింహారెడ్డి, దత్తోపంత్ నాయక్, సిర్నాపల్లి/సిర్పూర్కర్ దత్తాత్రేయరావు, తమ్మి రాములు అమరులయ్యారు. నిజాంపై పోరాటానికి సంబంధించి చరిత్రలో ఉమ్మడి ఇందూరు జిల్లా అనేక పుటలను లిఖించుకుంది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేంగా సాగిన పోరాటంలో నిజామాబాద్ జైలు 'రాజకీయ ఖైదీల బొందలగడ్డ'గా పేరుపొందింది. సమరయోధులు అనేక చిత్రహింసలను అనుభవించారు. ఈ జైలులో చోటుచేసుకున్న ఘటనలు దేశ వ్యాప్తంగా వార్తల్లోకెక్కాయి.

జైలులో అకృత్యాలు..

1947 ఆగస్టు 15న నిజాం నిషేధాజ్ఞలను ఉల్లంఘించి త్రివర్ణ పతాకం ఎగురవేయాలని హైదరాబాద్ నుంచి శ్రీ రామానంద తీర్థ పిలుపునిచ్చారు. ఇందూరు జిల్లాలోనూ అనేక మంది యువకులు జెండాలు ఎగురవేశారు. నిజాం పోలీసులు, రజాకార్లు దాడులు చేసి బంధించారు. జైలులో కిరాతకంగా కొట్టి హింసించారు. నరకయాతనలు పెట్టారు. 1948 జనవరి 11న రాత్రి 8 గంటల సమయంలో నిజామాబాద్ జైలు దాశరథి కృష్ణమాచార్య, వట్టికోట అళ్వార్‌స్వామి, మోతీలాల్ మంత్రి, వెంకటరమణయ్య, శ్యాం అప్పంగీకర్, జె హన్మంతరెడ్డి, విఠల్‌రెడ్డి కామారెడ్డి, బ్రహ్మయ్య, సి రాములు, పడిగల హన్మాండ్లు, అచ్యుతరావు దేశ్‌పాండే లాంటి 150 మంది రాజకీయ ఖైదీలతో కిక్కిరిసిపోయింది. వీరిపై ఒక్కసారిగా ఊహించని దాడి చేశారు. ఆ దాడి తుఫానులా తెలంగాణ అంతటా పాకింది. భారతదేశంలోని అన్ని పత్రికలకు ఈ సమాచారం అందింది. 1948 జనవరి 11న ఇద్దరు ఇత్తెహాదుల్ ముస్లిమీన్ కార్యకర్తలను రాజకీయ ఖైదీలున్న బ్యారక్‌లో ఉంచారు. వీళ్లిద్దరూ స్టేట్ కాంగ్రెస్ ఖైదీలతో గిల్లికజ్జాలు పెట్టుకోసాగారు. జైలులో వందేమాతర గీతం ఆలపించకూడదని అభ్యంతరం చెప్పారు. అయినప్పటికీ వందేమాతరం ఆలపించడంతో ఇత్తెహాదుల్ ముస్లిమీన్‌కు చెందిన ఖైదీలు 4వ బ్యారక్‌లో ఉన్న సత్యాగ్రహులను కర్రలతో విచక్షణరహితంగా కొట్టారు. అలారం మోగించారు. జైలు వార్డెన్లు, పోలీసులు, కొందరు బయటి వ్యక్తు లు జైలులోకి చొచ్చుకొచ్చి దాడిలో పాల్గొన్నారు. అందరూ కలిసి సత్యాగ్రహులను, వందేమాతరం ఆలపించిన వారిని క్రూరంగా కొట్టారు. చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. తలలు పగిలాయి. కొందరి కాళ్లు, చేతులు విరిగాయి. 150 మంది సమరయోధులు తీవ్రంగా గాయపడడంతో రక్తసిక్తమైంది. జలియన్‌వాలాబాగ్‌ను తలపించిన ఈ ఘటనను భారతదేశ వ్యాప్తంగా ఖండించారు. అప్పట్లో ఈ జైలును "సియాసీ ఖైదియోంకా ఖబరస్తాన్" ("రాజకీయ ఖైదీల బొందలగడ్డ") అనేవారు.





ఖిల్లా ముఖద్వారం

నేతాజీ స్ఫూర్తితో పోరులో దత్తాత్రేయరావు

మోపాల్ మండలం సిర్పూర్‌కు చెందిన సిర్పూర్కర్ దత్తాత్రేయరావు 1935లో ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. 'మీరు మీ రక్తాన్ని ఇవ్వండి-నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ మాటల స్ఫూర్తితో దత్తాత్రేయరావు అందులో చేరారు. అక్కడ విమానం నడపడం నేర్చుకుని సింగపూర్, బర్మా, జపాన్, జర్మనీ తిరిగారు. నిజాంపై మరో పోరాట యోధుడైన తన మిత్రుడు త్రయంబక్‌రావు పాఠక్ ద్వారా రజాకార్ల అరాచకాలను తెలుసుకుని అటు బ్రిటిష్ వాళ్లతో పాటు ఇటు నిజాంపై పోరుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నిజామాబాద్ బడాబజార్‌లో దత్తాత్రేయరావు ఇంట్లోనే ఆయుధాలు తయారు చేశారు. 1947 జూన్ 3న బ్రిటిష్, రజాకార్లు కలిసి చేసిన దాడిలో దత్తాత్రేయరావు గాయపడ్డారు. 1947 జూన్ 11న అమరుడయ్యారు.

పోరాటంలో అమరుడైన మోదాని

హైదరాబాద్‌కు చెందిన మోదాని రాధాకిషన్ నిజామాబాద్‌లో స్థిరపడ్డారు. ఆర్యసమాజ్‌లో పనిచేస్తూ నిజాం, రజాకార్లపై పోరాటం చేశారు. గోవంశ ఉద్ధరణ, సత్సంగ్ కార్యక్రమాల ద్వారా ఉద్యమాన్ని ముందు కు నడిపారు. 1939 ఆగస్టు 2న రజాకార్ల దాడిలో అమరుడయ్యారు. నిజామాబాద్‌లో ఆయన స్మారకంగా రాధాకిషన్ మార్గ్ నామకరణం చేశారు.

వీర పురుషుడు మిఠాయి గంగారాం

మిఠాయి గంగారాం తన వృత్తినే వదిలేసి పోరాటంలో పాల్గొన్నారు. ఎవరికీ జంకని వీరపురుషుడీయన అంటారు. ఉద్యమంలో పాల్గొన్నందుకు నిజాం ప్రభుత్వం గంగారాంను హైదరాబాద్, సికింద్రాబాద్ జైళ్లలో విడతలవారీగా ఉంచింది. 1947 జూలై 5 నుంచి 1948 అక్టోబర్ 7 వరకు జైలులో ఉన్నారు. జైలులో అనేక అవస్థలు పడ్డారు. హనుమాన్ వ్యాయామశాల స్థాపన నిర్వహణలో చాలా కృషి చేశారు.

■ త్రయంబకరావు పాఠక్ తన భార్య గాజులను అమ్మేసి హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్‌లో తన మిత్రుడు దత్తోపంత్‌తో బాంబులు తయారు చేయించారు. ఇందుకు సీహెచ్‌బీ విఠల్‌దాస్, కేవీ గంగాధర్‌లు సహకరించారు. అయితే బాంబులను రహస్యంగా చేరవేస్తున్నప్పుడు పేలుడు సంభవించి దత్తోపంత్ అనే సమరయోధుడు మరణించారు. ఇది పోలీసులకు తెలియడంతో అందరినీ బంధించి వేర్వేరు జైళ్లలో బంధించారు. త్రయంబకరావును 1947 డిసెంబర్ 14న హైదరాబాద్ జైల్లో పెట్టారు. 1948 అక్టోబర్ 7న విడుదలయ్యారు. నిజామాబాద్ ప్రాంతంలో జరిగిన అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నారు. హిందూ మహాసభకు జిల్లా కార్యదర్శిగా, ఆర్యసమాజ్ సభ్యులుగా వ్యవహరించారు.

ఆయుధాలు తెప్పించిన కేవీ గంగాధర్..

మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామానికి చెందిన కేవీ గంగాధర్‌ను నిజాం ప్రభుత్వం అతి ప్రమాదకర వ్యక్తిగా ప్రకటించింది. ఆర్యసమాజ్ ద్వారా ఈయన హిందూ ప్రజానీకాన్ని సంఘటిత పరిచారు. ఇందూరులో ఆర్యసమాజ్ విస్తరణకు బాగా కృషి చేశారు. తరువాత ఢిల్లీలో సార్వదేశిక ఆర్య ప్రతినిధి సభలో సభ్యులయ్యారు. నాందేడ్‌లోని గురుద్వారా నుంచి ఆయుధాలు తెప్పించి హన్మయ్య వస్తాదుచే యువకులకు శిక్షణ ఇప్పించారు. 25 ఏళ్ల వయస్సులోనే కేవీ గంగాధర్ నిజాం వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.



పెద్దబజార్‌లోని ఆర్యసమాజ్ ఇందూరు భవనం

ఉద్యమంలో భాగమైన భార్యభర్తలు

తమ్మి రాములు ఆర్మూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆర్యసమాజ్ ద్వారా నిజాంకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఉద్యమం నడిపారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీలోనూ పనిచేశారు. 1946లో ఖిల్లా జైలులో 8 నెలలు బందీగా ఉన్నారు. రాములు పోరాటానికి ఆయన భార్య తమ్మి సరస్వతి సహకరించారు. 1952లో నిజామాబాద్ టౌన్ ఎస్‌ఐ రాములు పిస్టల్‌తో కాల్చి చంపాడు. దీంతో కోపోద్రిక్తులైన ప్రజలు సదరు ఎస్‌ఐని వెతికి పట్టుకుని రోడ్డుమీదకు ఈడ్చుకుని వచ్చి అదే ఎస్‌ఐ వద్ద ఉన్న పిస్టల్‌తో కాల్చి చంపారు.

యుద్ధ విద్యలో శిక్షణ ఇచ్చిన మాణిక్ రెడ్డి..

ఇందూరులోని గాజుల్‌పేట్‌కు చెందిన 'లా' చదివిన బెల్లాల్ మాణిక్‌రెడ్డి ఆర్యసమాజ్ బృందాలతో కలిసి ఇందూరు యువకులకు యుద్ధవిద్యలో శిక్షణ ఇచ్చారు. రాత్రి సమయాల్లో యువకులను పోగేసి కర్రసాము, కరాటే, నాటు తుపాకీ వాడకం, బాంబుల తయారీ నేర్పించారు. నాటి పోరాట యోధులను కనిపిస్తే కాల్చేయమని నిజాం పోలీసులు ఉత్తర్వులు జారీ చేసిన సమయంలో అనేకమంది వీరులకు తన పొలంలో, ఇంట్లో ఆశ్రయం కల్పించి వారి బాగోగులు, వారి కుటుంబాల బాగోగులు చూసుకున్నారు. అప్పట్లో మాణిక్‌రెడ్డి ఇల్లు స్వాతంత్ర్య ఉద్యమకార్లకు భోజన సత్రంగా ఉండేదని నాటి సమరయోధులు చెప్పేవారు. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ర్యాలీలు, సత్యాగ్రహ దీక్షల్లో తాను ముందుండి యువకులకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ క్రమంలో జైలుకు వెళ్లారు.



ఖిల్లాలో దాశరథిని ఉంచిన జైలు గది

ఆర్యసమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల రుక్మారెడ్డి

ఆర్యసమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా నిజామాబాద్‌కు చెందిన నల్ల రుక్మారెడ్డి వ్యవహరించారు. నిజాంకు వ్యతిరేకంగా అప్పటి బాంబేలో పత్రిక ప్రింట్ చేయించి రహస్యంగా రైలు ద్వారా నిజామాబాద్ ప్రాంతానికి తెప్పించి పంచిపెట్టారు. 1932లో బాపూజీ వచనాలయానికి వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్నారు. 1947లో సుభాష్‌నగర్‌లో నిజాంకు వ్యతిరేకంగా సమావేశం పెట్టారు. నిజామాబాద్‌లో ప్లేగు వ్యాధి ప్రబలడంతో నాగారం పవర్‌హౌజ్ వద్ద ఉద్యమకారులు గుడారాలు వేసుకున్నారు. రజాకార్లు గుడారాలకు నిప్పు పెట్టారు. ఈ శిబిరంలో రుక్మారెడ్డి తమ్ముడు నల్ల నర్సింహారెడ్డిని రజాకార్లు కాల్చి చంపారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- శోభాయాత్రకు నగరంలో భారీ ఏర్పాట్లు
- దుబ్బలో ప్రారంభించనున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- జిల్లాలో 2వేల మందితో పోలీసు బందోబస్తు.. నగరంలో 700 మంది
- బాసర, ఉమ్మెడ గోదావరి బ్రిడ్జీల వద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లు




నగరంలోని వినాయకుల బావి

ఖలీల్‌వాడి/నిజామాబాద్ రూరల్: భక్తుల విశేష పూజలందుకున్న గణనాథుడు నేడు గంగమ్మ ఒడికి చేరనున్నాడు. ఈ మేరకు నిజామాబాద్ నగరంతో పాటు నందిపేట మండలంలో ని ఉమ్మెడ, నిర్మల్ జిల్లా గోదావరి తీరాన ఏర్పాట్లు పూర్తి చేశారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ వినాయక్‌నగర్‌లోని వినాయకుల బావి వద్ద ఏర్పా ట్లు చేసింది. శోభాయాత్ర రూట్‌లో రోడ్ల మరమ్మ తులు, లైటింగ్ పనులు పూర్తి చేశారు. సుమారు 50 మంది విద్యుత్ సి బ్బందితోపాటు మున్సిపల్ అధి కారులు ముగ్గు రు డీఈఈలు, నలుగురు ఏఈఈ లు, పారిశుధ్య సిబ్బంది మొత్తం వెయ్యి మందికిపైగా సిబ్బంది గణేశ్ నిమజ్జన విధులు నిర్వర్తించనున్నారు. గోల్‌హనుమాన్ వద్ద శోభాయాత్రకు స్వాగతం పలికేందుకు సంస్కారభారతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

బాసర, ఉమ్మెడ గోదావరి తీరానికి..

జిల్లాలో 5,800 వరకు విగ్రహాలను ఏర్పాటు చేయగా, తొమ్మిది రోజులకు 1200 విగ్రహాలను నిమజ్జనం చేశారు. మంగళవారం 4600 విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8 ఫీట్ల కన్నా తక్కువ ఎత్తున్న గణేశ్ విగ్రహాలను అర్సపల్లి, జానకంపేట మీదుగా బాసరకు, అంత కంటే ఎక్కువ ఎత్తున్న విగ్రహాలను కంఠేశ్వర్, మానిక్‌బండార్, మాక్లూర్, నందిపేట మీదుగా ఉమ్మెడ గోదావరికి తరలించనున్నారు. జానకంపేట వద్ద రైల్వే ఎలక్ట్రిక్ లైన్ ఉన్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.



పోలీసుల బందోబస్తు

వినాయక నిమజ్జనానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఏర్పాట్లపై సమీక్షించిన డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పలు సూచ నలు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2వేల మంది విధులు నిర్వర్తించనుండగా, జిల్లా కేంద్రంలో 700 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారు. ఇందులో ముగ్గురు ఏసీపీలు, 12 మంది సీఐలు, 22 మంది ఎస్సైలున్నారు.

ట్రాఫిక్ డైవర్షన్ ఇలా..

గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో బాసర గోదావరి బ్రిడ్జి మీదుగా పబ్లిక్ వాహనాలను మంగళ, బుధవారాల్లో అనుమతించడం లేదు. నిజామాబాద్ నుంచి బాసర వైపు వెళ్లే వాహనాలు నవీపేట్ శివాజీ చౌక్ నుంచి కళ్యాపూర్, దండిగుట్ట, వీరన్నగుట్ట, రెంజల్ కమాన్ ఎక్స్ రోడ్, సాటాపూర్ ఎక్స్ రోడ్, నీల, నీలా పేపర్ మిల్, కందకుర్తి బ్రిడ్జి మీదుగా ధర్మాబాద్ కు అక్కడి నుంచి బిద్రెల్లి మీదుగా బాసరకు చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే బాసర వైపు నుంచి నిజామాబాద్ వైపు వచ్చే వాహనాలు బిద్రెల్లి నుంచి ధర్మాబాద్ మీదుగా కందకుర్తి, రెంజల్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. ఈ రూట్‌లోనే గణేశ్ నిమజ్జనం చేసిన విగ్రహాలు సైతం నిజామాబాద్‌కు చేరాల్సి ఉంటుంది. ఉమ్మెడలో భారీ విగ్రహాలను నిమజ్జనం చేసి వచ్చే వాహనాలను అయిలాపూర్, చిక్లి, కొత్తపల్లి, జన్నేపల్లి మీదుగా నిజామాబాద్‌రూరల్ మండలంలోని కాలూర్, ఖానాపూర్ నుంచి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.



నగరంలోని దుబ్బ చౌరస్తా నుంచి వినాయకుల బావి వరకు శోభాయాత్ర సాగే రూట్ మ్యాప్

నేడు ప్రజాపాలన దినోత్సవం

- ముస్తాబైన కలెక్టరేట్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించ తలపెట్టిన ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) ముస్తాబైంది. మంగళవారం నిర్వహించనున్న వేడుకల కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 10 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు ఏర్పాట్లను సోమవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. వారివెంట అదనపు డీసీపీ కిషన్, కలెక్టరేట్ అధికారులున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

నిజామాబాద్ సిటీ: తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం సీపీఎం జాతీయ కార్యదర్శి దివంగత సీతారం ఏచూరీ సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించడమే సీతారం ఏచూరీకి నిజమైన నివాళి అన్నారు. నిజాం నవాబుకు, పెత్తందార్లకు, దొరలకు వ్యతిరేకంగా జరిగినదే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు. నాయకులు శంకర్, నన్నేసాబ్, విఘ్నేష్, మారియ, ఇవీల్, రాములు, నూర్జహాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

క్లుప్తంగా

19న స్పేర్ పార్ట్స్ వేలం

ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న వాహనాల స్పేర్ పార్ట్స్ వేలం పాట ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ సోమవారం తెలిపారు. ఆసక్తి గల వారు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగే వేలం పాటలో పాల్గొనాలని చెప్పారు.

ఏర్గట్ల విద్యార్థికి గోల్డ్ మెడల్



మోర్తాడ్(బాల్కొండ): హస్తిన గడ్డపై ఏర్గట్లకు చెందిన డిగ్రీ విద్యార్థిని సూదన వేణి సాత్విక తన సత్తా చాటింది. ఎన్‌సీసీ శిక్షణలో బంగారు పతకం సాధించి ఏర్గట్ల కీర్తిని ఇనుమడింపజేసింది. నిజామాబాద్‌లోని మహిళా కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న సాత్విక ఎన్‌సీసీలో చేరింది. మొదట అనంతపురం, కాకినాడ, తమిళనాడులో శిక్షణ పొందింది. సాత్వికతో కూడిన బృందం షూటింగ్ శిక్షణ కోసం ఢిల్లీకి వెళ్లగా అక్కడ తన ప్రతిభ కనబరిచి తొలి ప్రయత్నంలోనే బంగారు పతకాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎన్‌సీసీ ప్రధాన శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతుంది.

సినిమా షూటింగ్ ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో పడిలేచిన మర్రి చెట్టు వద్ద సోమవారం గ్యాంగ్ ఆఫ్ గోపాల్‌పేట్ అనే సినిమా షూటింగ్‌ను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. చిత్ర నిర్మాత ఫణీంద్ర, దర్శకుడు మధుమల్లం మాట్లాడుతూ.. పూర్తిగా గ్రామీణ నేపథ్యంతో సినిమా ఉంటుందన్నారు. ముప్కాల్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో షూటింగ్ చేపడుతామన్నారు. గేయ రచయిత కోదారి శ్రీనివాస్ సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. అసోసియేట్ డైరెక్టర్ సంఫీుర్, బుక్ డిపో అధినేతలు రాంరాజు, ఉమేశ్ పాల్గొన్నారు.

విమోచనమే లక్ష్యంగా పోరాటం



తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లపై నిప్పులు కురిపించిన ఫిరంగి

- నిజాం రజాకార్లపై తెగింపుతో ప్రతిదాడులు చేసిన ఉద్యమకారులు
- సిపాయిల తిరుగుబాటు స్ఫూర్తితో విమోచనోద్యమంలో ధైర్యం ప్రదర్శించిన వీరులకు పుట్టినిల్లు ఇందూర్
- తెలంగాణ సాయుధ పోరాటంలో నిజామాబాద్‌కు సుస్థిర స్థానం



మోర్తాడ్(బాల్కొండ): నిజాం రజాకార్ల గుర్రపు డెక్కల చప్పుళ్లకు వెరవని ధీరులు మనవారు. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించడానికి 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటుతో స్ఫూర్తి పొందిన మన సమరయోధులు నిజాం నిరంకుశత్వంపై నిరసన గళం విప్పారు. మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలో మన ప్రాంతానికి చెందిన కౌలాస్ రాజు దిలీప్ సింగ్ చూపిన పోరాట పటిమ, ఝాన్సీ లక్ష్మీబాయ్ ప్రదర్శించిన తెగువతో తెలంగాణ విమోచనం కోసం సాయుధ పోరాటానికి నాంది పలికిన వారు కొందరు. అలాగే మహాత్మా గాంధీ బాటలో సత్యాగ్రహం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసిన వారు మరికొందరు. ఇలా తెలంగాణ విమోచనం కోసం హింస, అహింసా మార్గాల్లో వేర్వేరుగా పయనించిన యోధులకు పుట్టినిల్లు మన ఇందూర్ గడ్డ. ఒకవైపు బ్రిటీష్ పాలనను ఎదిరిస్తూ మరో వైపు నిజాం నిరంకుశ పాలనపైన కత్తి ఎక్కుపెట్టిన ధీరత్వం మనవారి సొంతం. ఏక కాలంలో రెండు స్వాతంత్ర్య పోరాటాలు చేసిన ఘనత మనకే దక్కుతుంది. పల్లెలపై దాడులు చేస్తూ అమాయక ప్రజల ధన, మాన ప్రాణాలను హరిస్తున్న రజాకార్ల గుంపుపై ఫిరంగులతో దాడికి పాల్పడిన మోర్తాడ్ జమీందార్ రుక్మారెడ్డిని దొంగచాటుగా బంధించిన నిజాం పాలకులు ఇనుప సంకెళ్లతో కట్టిపడేశారు. మోర్తాడ్ ప్రాంత ప్రజలకు అండగా నిలబడిన రుక్మారెడ్డిని రజాకార్లు బంధించి జైల్లో ఉంచారు. ఇదే స్వాతంత్ర్య పోరాటంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. చౌట్‌పల్లి నారాయణరెడ్డి ఆర్య, చౌట్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, పడిగెల హన్మాండ్లు, నారాయణ లింగారెడ్డి, నీలకంఠ నారాయణ, పడకల్ శ్రీనివాస్‌రెడ్డి, శంభులింగం, లక్ష్మాగౌడ్, బ్రహ్మయ్య, వెంకటస్వామి, బొంబాయి నర్సింహారెడ్డి, నర్సింహారావు, నరసింహశాస్త్రి, కొండా నారాయణ, ఉప్పు లక్ష్మయ్య, జే. హన్మంత్‌రెడ్డి, టి. రంగారెడ్డిలు రామానంద తీర్థ స్టేట్ కాంగ్రెస్ ఉద్యమానికి ప్రభావితులయ్యారు. ఉద్యమాన్ని ఉవ్వెత్తుకు తీసుకెళ్లడానికి మన వారు రామానంద తీర్థకు ఎంతో సహకరించారు. 1947 ఆగస్టు 15న దేశమంతటా త్రివర్ణ పతాకం ఎగురవేయడానికి సన్నాహాలు జరుగుతుంటే నిజాం పాలనలో ఉన్న మనకు ఆ స్వేచ్ఛను రజాకార్లు హరించారు. కాని మన సమరయోధులు మాత్రం రజాకార్ల ఆజ్ఞలను లెక్క చేయకుండా మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. ఫలితంగా జైలు ఊచలు లెక్కించాల్సి వచ్చింది.

ప్రజాసేవలో ఉద్యమకారులు



అర్గుల్ రాజారాం, మాజీ మంత్రి (ఫైల్)



నారాయణ రెడ్డి, మాజీ ఎంపీ(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): తెలంగాణ విమోచన ఉద్యమంలో పాలుపంచుకున్న ఉద్యమకారులు ఆ తరువాత రాజకీయాల్లో చేరి ఉన్నత పదవులను అలంకరించారు. మోర్తాడ్ మండలం సుంకెట్‌కు చెందిన ఎం. నారాయణరెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన అర్గుల్ రాజారాం బాల్కొండ నియోజకవర్గానికి నాలుగుమార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడంతో పాటు చేనేత, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రిగా విశిష్టమైన సేవలు అందించారు. చౌట్‌పల్లికి చెందిన హన్మంత్ రెడ్డి తెలంగాణ విమోచన ఉద్యమంలో గ్రామీణ ప్రాంత యువకులను సమీకరించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఉద్యమానికి అవసరమైన ఆర్థిక సహకారం అందించారు. తెలంగాణ విలీనం అనంతరం ఆయన జిల్లా పరిషత్ మొట్ట మొదటి చైర్మన్‌గా ఎన్నికై ప్రజా సేవలో కొనసాగారు. వీరితో పాటు అనేక మంది తమ సొంత గ్రామాలలో సర్పంచ్‌లుగా, సహకార సంఘాల చైర్మన్లుగా ఎంపికై ప్రజలకు విశేషమైన సేవలు అందించారు.

సిరికొండలో సాయుధ పోరాట ఛాయలు

సిరికొండ: మండలంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఛాయలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఆనాటి ప్రజలు నేటికీ గత స్మృతులను నెమరువేసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్ల ప్రాంతానికి చెందిన అణభేరి ప్రభాకర్‌రావు నేతృత్వంలో మండలంలో సాయుధ పోరాటం జరిగినట్లు ఆనాటి పెద్దమనుషులు చెబుతారు. ప్రభాకర్ సారథ్యంలో అదే సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అమృత్‌లాల్ శుక్లా, శివాయిపల్లెకు చెందిన బల్‌రాంలు ఇక్కడ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. రజాకార్ల అకృత్యాలకు వేదికగా మారుతోందని హొన్నాజీపేట్ గడీపై వీరి ముఠా దాడి చేసింది. దాడితో గడీ దొర ప్రతాప్‌రెడ్డి, హైదరాబాద్‌కు పారిపోయారు. గడీలో ఉన్న వ్యవసాయ పరికరాలను వారు ఎత్తుకెళ్లారు. అనంతరం గడీని తగులబెట్టారు. ఈ ఘటనలో గడీలో కొద్ది భాగం ధ్వంసమైంది. ప్రభాకర్‌రావు బృందం మండలంలోని వివిధ గ్రామాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకొని భూస్వాముల చెరలో ఉన్న భూములను పేదలకు పంచిపెట్టారు. కొండాపూర్, తూంపల్లి గ్రామాల్లో రెండు వందలు, తాటిపల్లిలో వంద, కమ్మర్‌పల్లి మండలం మానాలలో ఐదు వందలు, మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లెలో యాభై ఎకరాల భూములను భూస్వాముల చెర నుంచి విడిపించి పేదలకు పంచారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌లో దాడి చేసి గ్రామ రికార్డులను దహనం చేశారు. వీరి సారథ్యంలో ఉద్యమం నడుస్తుండగా రజాకార్లకు పన్నులు కట్టడం, పశువులు మేపుకున్నందుకు చెల్లించే పన్నులను చెల్లించడం మానేశారు. అలాగే గడ్కోల్ గ్రామంలో దొరల వద్ద గుమాస్తాగా పని చేసే జంగం గంగన్నను ఉద్యమకారులు గ్రామ నడిబొడ్డున కాల్చి చంపారు.



హొన్నాజీపేట్ గడీ ముఖద్వారం (ఫైల్)

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జేఎస్‌గా శ్యాం



నిజామాబాద్‌నాగారం: బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్యాం ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని 2024–2028 సంవత్సరాలకు ఎన్నుకున్నారు. శ్యామ్‌ను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ఉపాధ్యక్షులు రంజిత్, కిశోర్, కిషన్, రాజ్‌కుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, కోశాధికారి రాజేశ్వర్, సంఘ సభ్యులు తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో జిల్లాకు పతకాల పంట



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ నెల 14, 15న హైదరాబాద్‌లో జరిగిన 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకాల పంట పండించారు. విజేతలను యోగా సంఘం ప్రతినిధి ఐశ్వర్య కాలే, ప్రధాన కార్యదర్శి గంగాధర్, యోగ సంఘం సభ్యులు అభినందించారు. వీరు అక్టోబర్ 24 నుంచి 28 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే 48వ జాతీయ స్థాయి యోగాసన పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

విజేతలు

- అండర్ 8–10 బాలుర విభాగంలో అన్షుల్ బంగారు పతకం
- బాలికల విభాగంలో పి.దీక్షిత(కాంస్యం)
- అండర్ 16–18 బాలికల విభాగంలో శ్రీనిధి(కాంస్యం)
- 45 సంవత్సరాలు పైబడిన పురుషుల విభాగంలో ఆర్.రఘు(కాంస్యం)
- అండర్ 12 –14 బాలికల విభాగంలో స్మైత్రి కాచారి(4వ స్థానం)
- అండర్14–16 బాలుర విభాగంలో బి.వర్షిత్ 6వ స్థానంలో నిలిచారు.

బాలుడి హత్య కేసులో నిందితుడికి రిమాండ్

బాల్కొండ: మండల కేంద్రంలోని ఖిల్లాలో గత శుక్రవారం బయటపడిన బాలుడి హత్య కేసుకు సంబంధించి నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బాల్కొండకు బండి నరేందర్ బాలుడిని ఈ నెల 11న చిట్టాపూర్ నుంచి బైక్‌పై తీసుకువచ్చాడు. బాలుడితో అసహజరీతిలో లైంగిక చర్యలకు పాల్పడి బాలుడిని బండరాయితో మోది హత్య చేశాడు. బాలుడి కిడ్నాప్ కేసు నమోదైనప్పటి నుంచి నరేందర్ కదలికలను గమనిస్తూ తమదైన శైలిలో పోలీసులు విచారణ చేపట్టగా నిజం ఒప్పుకున్నాడు.

'నటేశ్వరశర్మ సాహితీ సేవలు అనన్య సామాన్యం'

కామారెడ్డి అర్బన్: దాశరథి పురస్కార గ్రహీత దివంగత అయాచితం నటేశ్వరశర్మ సాహితీ సేవలు అనన్య సామాన్యమైనవని మల్లినాథసూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దృశ్యకవి అమరకుల చక్రవర్తి పేర్కొన్నారు. మల్లినాథసూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి వశిష్ట డిగ్రీ కళాశాలలో నటేశ్వరశర్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు నటేశ్వరశర్మ రచనలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో నటేశ్వరశర్మ విగ్రహం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఏడుపాయల సంస్థాన్ కళాపీఠం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బ విజయశ్రీ, తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

అమరేశం రాజేశ్వరశర్మకు నివాళులు

కామారెడ్డి ప్రాచ్యవిద్య కళాశాల వ్యవస్థాపక సభ్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ మాజీ అధ్యక్షుడుగా, కాకతీయ విశ్వవిద్యాలయం డీన్‌గా పనిచేసిన కామారెడ్డికి చెందిన ప్రొఫెసర్ అమరేశం రాజేశ్వరశర్మ (94) ఈనెల 15న మృతికి మల్లినాథసూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ జిల్లాశాఖ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. రాజేశ్వరశర్మ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పలువురు రచయితలు, కవులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

నకిలీ విత్తనాలుగా తేలితే కఠిన చర్యలు

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

జక్రాన్‌పల్లి: మండలంలో రైతులు వేసిన సన్నరకం వరి విత్తనాలు నకిలీవని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో రైతులు నష్టపోయిన వరి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. జక్రాన్‌పల్లి మండలంలో మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ 200 సన్నరకం విత్తనాలను రైతులు పెద్ద సంఖ్యలో వేశారని తెలిపారు. కానీ చివరి దశలో గింజ గట్టిపడే సమయంలో పెద్ద మొత్తంలో తాలు పోవడం తమ దృష్టికి వచ్చిందని వివరించారు. పంట దిగుబడి కోసం రైతులు రకరకాలుగా ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించడం లేదన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీతో రైతులు బైబ్యాక్ ఒప్పందం చేసుకుని వరి పంటను పండిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం రైతులకు సరఫరా చేసిన విత్తనాలు నాటిన పంటలు బాగా ఉన్నాయని తెలిపారు. కానీ ప్రైవేటు కంపెనీ విత్తనాలు వేసిన వరి సుమారు వంద ఎకరాల్లో పంట నష్టం జరుగుతోందన్నారు. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలిపామని, రెండు రోజుల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి పంటలను పరిశీలిస్తారన్నారు. విత్తనాలు నకిలీవని తేలితే కంపెనీపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రదీప్, ఏవో దేవిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, సొసైటీ చైర్మన్లు గంగారెడ్డి, నర్సారెడ్డి, నాయకులు కాటిపల్లి నర్సారెడ్డి, గడ్డం గంగారెడ్డి, జైడి మల్లేష్, జితేందర్ పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో వరిని పరిశీలిస్తున్న అన్వేష్‌రెడ్డి

క్రైం కార్నర్

ఆర్కెస్ట్రా ప్రదర్శన నిలిపివేత

- పది మందిపై కేసు నమోదు

రుద్రూర్: మండల కేంద్రంలోని అంగడి బజార్ నవయుగ గణేష్ మండలి 50వ వార్షికోత్సవం పురస్కరించుకుని గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వరాంజలి ఆర్కెస్ట్రా కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోలీసులు వచ్చి కార్యక్రమానికి అనుమతి లేదని ఆపేశారు. అభ్యంతరకర రికార్డింగ్ డ్యాన్స్‌లు చేస్తున్నారని పేర్కొంటూ ఆర్టిస్టులు, కార్యక్రమ నిర్వాహకులు పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

నిజాంసాగర్ కాలువలో మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రధాన కాలువ నీటిలో సోమవారం మహిళ మృతదేహం కొట్టుకువచ్చినట్లు నీటిపారుదలశాఖ సిబ్బంది తెలిపారు. మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్ గేటు వద్ద ప్రధాన కాలువలో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం కొట్టుకుపోతుండగా స్థానికులు గమనించి నీటి పారుదల శాఖాధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహిళ ప్రధాన కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుందా లేక ఇటీవల కురిసిన వర్షాలకు వరదల్లో కొట్టుకువచ్చిందా తెలియాల్సి ఉంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఏఎస్సై వెంకట్‌రావ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దూళి గంగారాం కొన్ని రోజుల క్రితం అనారోగ్యం బారిన పడడంతో నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారం, రూ.10 వేల నగదును దొంగిలించారు. గంగారాం కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై అన్నారు.

బాన్సువాడలో ద్విచక్రవాహనం..

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని చైతన్య కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు సోమవారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న ఎప్పటిలాగే తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయం చూసేసరికి కన్పించలేదన్నారు. బాన్సువాడ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్‌లోన్ పేరిట సైబర్ మోసం

ఖలీల్‌వాడి: బ్యాంక్ లోన్ పేరిట సైబర్ మోసానికి ఓ వ్యక్తి గురైనట్లు రెండో పోలీస్ స్టేషన్ ఎస్సై యాసిన్ అరాఫత్ సోమవారం తెలిపారు. వివరాలు.. నగరంలోని బర్కత్‌పురాకు చెందిన మొహమ్మద్ ముజాహిద్‌కు 12 అంకెల నంబరుతో ఫోన్ వచ్చింది. లోన్ అప్లై చేసుకున్నారు కదా.. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాను.. మీ లోన్ అప్రూవ్ అయింది, వీడియో కాల్ చేస్తే లిఫ్ట్ చేయగలరని చెప్పారు. ఆటోమేటిక్‌గా మీ డిటెయిల్స్ మాకు షేర్ అయిపోతాయని చెప్పగానే ముజాహిద్ వీడియో కాల్ లిఫ్ట్ చేశారు. వెంటనే ముజాహిదీన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.1.40 లక్షల నగదు కట్ అయ్యాయి. బాధితుడు సైబర్ మోసాన్ని గ్రహించి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏదైనా ఫ్రాడ్ కాల్, ఫేక్ కాల్ వస్తే నమ్మవద్దని, వెంటనే 1930కి కాల్ చేసి చెప్పాలన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి



మురళి (ఫైల్)

వర్ని/బిచ్కుంద: మల్లారం శివారులో సోమ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆగుల మురళి(26) అక్కడికక్కడే మృతి చెందాడు. మెండోరా మండలం దూదిగావ్‌కు చెందిన మురళి తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై బిచ్కుంద వెళ్తుండగా ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మురళి అక్కడికక్కడే మృతి చెందగా, భార్య స్వప్నకు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మురళి బిచ్కుందలో ప్రభుత్వ ఉద్యోగి అని, స్వగ్రామం నుంచి బిచ్కుంద వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు వర్ని ఎస్సై కృష్ణ కుమార్ వెల్లడించారు. మృతుడి సోదరుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దూదిగావ్‌లో విషాదఛాయలు

బాల్కొండ: మురళి మృతితో దూదిగావ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మురళి బిచ్కుంద మండలంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో మురళి తండ్రి గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వర్తించేవాడు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ ఉద్యోగాన్ని మురళి తల్లికి ఇచ్చారు. మురళి తల్లి రెండున్నరేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ ఉద్యోగాన్ని మురళీకి ఇచ్చారు. ఏడాదిన్నర క్రితమే మురళీకి వివాహమైంది. భార్య, భర్తలు కలిసి బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అందరితో కలుపుగోలుగా ఉండే మురళీని మృత్యువు కబలించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

చెరువులో మునిగి యువకుడు..



రాకేష్ (ఫైల్)

ఎల్లారెడ్డి: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట పటేల్ చెరువులో సోమవారం గణేశ్ నిమజ్జనం సందర్భంగా చెరువులో మునిగి యువకుడు మృతి చెందాడు. లింగారెడ్డిపేట ఎస్సీ కాలనీకి చెందిన బుజ్జిగారి రాకేష్ (25) అలియాస్ యేసయ్య గణేశ్ విగ్రహ నిమజ్జనం అనంతరం చెరువులో ఈత కోసం దిగాడు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ఆటో బోల్తా పడి బాలుడు..



మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కేసీఆర్ కాలనీ సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడిన ఘటనలో సయ్యద్ రియాన్(9) అనే బాలుడు మృతి చెందగా.. మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. భీమ్‌గల్ నుంచి ఆర్మూర్ వైపునకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. ప్రయాణ సమయంలో ఆటో ఐదుగురు ఉన్నారని, మరో చిన్నపాటి గాయాలయ్యాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

నీటి కుంటలో పడి వృద్ధుడు..



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సిరికొండ: గడ్డమీది తండాకు చెందిన వృద్ధుడు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై రామ్ తెలిపారు. వివరాలు.. తండాకు చెందిన గుగులోతు హర్యా(60) అనే వృద్ధుడు తన ఆవుల వద్ద పేడ తీసి చేతులు కడుక్కోవడానికి సమీపంలోని కుంట వద్దకు వెళ్లాడు. చేతులు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడు. హర్యాకు భార్య గోరితో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మరొకరు..



మృతుడు సిద్ధిరాములు

మాచారెడ్డి: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృత్యువాత పడ్డ ఘటన పాల్వంచ మండలం ఎలుపుగొండలో సోమవారం చోటు చేసుకొంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గెరిగంటి సిద్దిరాములు(40) సాయంత్రం గ్రామ శివారులోని పోచమ్మ వాగులోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకొని నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయ్‌లో పాలెంవాసి ఆచూకీ గల్లంతు

- మతి స్థిమితం కోల్పోయి ఒంటరిగా తిరుగుతున్న వైనం
- రెండు నెలల నుంచి కనిపించని జాడ



హనుమంతు

మోర్తాడ్: తనపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఎంతో కొంత సంపాదించి పెట్టాలనే ఆశతో దుబాయ్‌కి వెళ్లిన ఒక వ్యక్తి తీవ్ర మానసిక వేదనకు గురై మతి స్థిమితం కోల్పోయాడు. కంపెనీ క్యాంప్ నుంచి బయటకు వెళ్లిన ఆయన ఆచూకీ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు. పరాయి దేశంలో తమ వ్యక్తి ఎలా ఉన్నాడో అని ఆవేదనకు గురవుతున్నారు. మోర్తాడ్ మండలం పాలెంకు చెందిన హనుమంతు రెండున్నర నెలల కిందట దుబాయ్‌కి వెళ్లాడు. 15 రోజుల పాటు పనిచేసిన ఆయన అకస్మాత్తుగా మాయమయ్యాడు. దుబాయ్‌లోని ఆల్ వర్కా ప్రాంతంలో కొందరికి కనిపించినట్లు తెలిసింది. ఆచూకీ కోసం పాలెంకు చెందిన వ్యక్తులు గాలిస్తున్నా ప్రయోజనం లేకపోయింది. మన రాయబార కార్యాలయంతో పాటు దుబాయ్ పోలీసులు స్పందించి హనుమంతు ఆచూకీని గుర్తించాలని అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చేపల వేట విషయంలో వివాదం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద కాలువలో చేపల వేట విషయంలో వివాదం తలెత్తడంతో సోమవారం రాత్రి బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మత్స్యకారులు బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్ ముప్కాల్ మండల కేంద్ర శివారులో ఉండటంతో ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన మత్స్యకారులే చేపలు పట్టుకుంటామని, ఇతర గ్రామాల మత్స్యకారులు చేపల వేట కొనసాగించవద్దని అంటున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే రోడ్డెక్కి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.